
# ఋణ ముక్తి

ఫణిహారం వల్లభాచార్య



"అయితే అంతేనంటావా ?"


"అంతకాక మరింకెంత చినబాబూ!"

వాళ్లిద్దరి మధ్య నెల్రోజులుగా అదే ప్రశ్న, అదే జవాబు- అలా గుడుగుడు గుంచంలా తిరుగుతూనే ఉంది. ఇద్దరిలో ఎవరూ "కత్తెయ్యనా? దెబ్బెయ్యనా?" అనటంలేదు. ఇద్దరూ యాభై ఏళ్లు కలిసి నడిచొచ్చిన వాళ్లే. ఒకడు చినబాబు, రెండోవాడు సాంబయ్య. వాళ్లిద్దరూ ఏకవచనం!

అసలు గొడవ ప్రారంభమై రెండు నెలలు దాటింది. చినబాబు ఊరొదిలిపోనంటాడు. ఊరొదిలేస్తే కానీ బతకలేమంటాడు సాంబయ్య. చినబాబు తాతతండ్రులు జమీన్‌దారులే. సాంబయ్య తాతతండ్రులు వాళ్లకి కుడిభుజాలే. చినబాబు తాత తన తరంలో ఆ ఊళ్లో అణా బేడకి దొరికిన భూములన్నీ కొనేసిన మాట నిజమే. అస లా పెద్దాయన ఆ ఊరివాడు కాకపోవటమూ నిజమే. గోదారొడ్డున పల్లెటూళ్లో

బంగారంలాటి గంగాబొండాల తోట అరెకరం ప్లస్ పెళ్లాం మెడలోని మరికొంచెం బంగారం అమ్మేసి ఈ ఊరొచ్చిపడ్డాడు పెద్దాయన. ఆయన వచ్చేనాటికి పెద్ద ఊరేమీ లేదు. కోస్తా నుంచి ఆయనతో వచ్చిన నాలుగు కుటుంబాలతో కలిసి అరవై గడప. పొలాలూ లేవు. బీళ్లు - బంజర్లు. మాటకారి ముసలాయన ఆ ఇలాక పెద్దల్ని పట్టి భూములు కొనేశాడు. పిట్టల్ని కొట్టుకునే వాళ్లకి అరక పట్టడం నేర్పాడు. బీడు నుంచి బంగారాన్ని పండించాడు. తనెంత తినాలి? బొత్తిగా అందరికీ పంచిపెట్ట లేదు కానీ అరవై గడప ముప్పూటలా పని చేసి తినే అలవాటు చేశాడు. ఎవరింటిలోనూ 'చేదు' అన్నది లేకుండా చేశాడు. అది వందేళ్ల నాటి మాట!

ఏళ్లతో పాటు ఏర్లూ, ఊర్లూ మారినట్టే ఆ ఊరూ మారింది. ఊరుమారిన కొద్దీ చినబాబు తండ్రి రాతా, కోతా మారింది. కానీ భారీచేతికి బారం తెలియదు కదా! అడిగిన వాడికి అడిగినంత ఇచ్చి ఎకరాలకు సున్నాలు చేర్చలేదు కానీ ఇంటికి సున్నాలు ఏడాదికి కాక రెండేళ్లకి, ఆ తరువాత చెయ్యి వెసులుబాటు అయినప్పుడు దక్కాయి. తండ్రి అలా కాలూ చేయీ కూడదీసుకోవలసిన స్థితిలో ఉన్నప్పుడు భూమ్మీద పడ్డాడు చినబాబు. చినబాబు



వారం వారం
కథాప్రభ




పుట్టిన నాల్రోజులకి పుట్టాడు సాంబయ్య. అప్పట్నించి ఇప్పటికి యాభై ఏళ్లు. చినబాబు దగ్గర మిగిలింది ఆరెకరాలు, నాలుగు మండువాల లోగిలి. సాంబయ్యకు మిగిలింది రెండెకరాలు, చినబాబు లోగిట్లో పాక. చినబాబు ఎకరాలు తరిగినా సాంబయ్య తాత నుండి ఆ రెండెకరాలు ఎదగలేదు. సాంబయ్య తాత తండ్రులు ఆ చెక్కను విడిగా చూసుకోలేదు. అంతా ఏకఖండంగానే దున్నారు. ఇన్నాళ్లకి ఊళ్లో లెక్కలు వచ్చాయి.

"మావా, బాబాయ్, అల్లుడూ, అబ్బాయ్" పిలుపులు వినమరుగై యజమాని, పాలేరు వచ్చాయి. ఏ కులాని కా కులం తమ అస్తిత్వాన్ని నిలుపుకుంటూనే ఏక కుటుంబంగా ఉన్న ఊళ్లో ఒకరినొకరు దోచుకుంటున్నారన్న 'జ్ఞానం' పెల్లుబికింది. "పండిన ఊళ్లకు ప్రభువునే అందరు. ఎండిన బీళ్లగోడెరుంగరు" అన్నట్టు బంగారం పండే చినబాబు పొలం మీద లెక్కలు సాగాయి. దాన్ని ఆనుకొన్న సాంబయ్య చెక్క లెక్కలూ వచ్చాయి. చినబాబు తాత తవ్వించిన బావి ఆ పొలానికి శ్రీరామరక్ష కావటంతో నీటి కటకట లేదు. మిగిలిన భూముల్లో నీటి ఎద్దడి గుర్తుకి వచ్చింది. చెరువు కింద భూముల జాడ కొంత మెరుగైనా మిగిలిన వాళ్ల సంగతి? ఒకప్పుడు ఆ చెరువు, ఈ బావి సరి! చినబాబు పొలాలు ఒక పక్కనుంచి అమ్ముకుంటూ రాగా ఈ బావి సౌకర్యం తగ్గుతూ వచ్చింది. ఇప్పుడు ఆ బావి నీళ్లు చినబాబు, సాంబయ్య పొలాలకే పరిమితం. బావి ఒడ్డున పొగడ చెట్లు నాలుగూ వాళ్లిద్దరికే!

తెలతెలవారుతుండగానే చినబాబూ, సాంబయ్య పరుగులు తీసి పొగడపూలు ఏరితెచ్చి దండలు కట్టటం యాభైఏళ్ల తరువాత కూడా వాళ్లకి శుభోదయ పరిమళస్మృతి ఇప్పటికీ! పొగడ దండతో మొదలైన రోజు రోజంతా వాళ్లిద్దరికీ పరిమళ వీచిక. సాంబయ్య కట్టిన పొగడదండను చినబాబు తల్లి ఎప్పుడూ నీళ్లు చల్లి తీసుకోలేదు. ఆ దండ నేరుగా దేవతార్చన గూటిలో వాలేది. అత్తగారు కాస్తంత చాదస్తానికి పోయినా చిరునవ్వు నవ్వేసేది ఆ కోడలు.

"నాయనమ్మ ఎందుకలా అంటుంది?"

> ## దుప్పటి చెట్లు
>
> దక్షిణ అమెరికాలోని అండెస్ అనే ప్రాంతంలో పెరిగే కొన్ని రకాల చెట్ల నుండి దుప్పట్లు తయారు చేసుకోవచ్చు. ఈ చెట్టు బెరడు దుప్పట్లు తయారు చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. అందుకే వీటిని దుప్పటి చెట్లు అంటారు. అలా తయారైన దుప్పటి ఆరడుగుల పొడవు, అయిదు అడుగుల వెడల్పు ఉంటుంది.
>
> వెస్ట్ ఇండీస్‌లో సంగీతాన్ని వినిపించే చెట్లు ఉన్నాయి. ఈ చెట్టు ఆకులకు, గింజలకు సన్నని చీలికలు ఉంటాయి. వీటి ద్వారా గాలి దూసుకు వెళ్లినప్పుడు విచిత్రమైన ధ్వని పుడుతుంది. అయితే ఈ సంగీతం గుండెలదిరేంత భయంకరంగా ఉంటుంది.
>
> కలపర్తి సత్యం (ఏలూరు)

అన్నది చినబాబు సందేహం. "సాంబయ్యని మనం తాకకూడదా?" అన్నది ఆ చిన్నవాడి ప్రశ్న.

"చిన్నా! నాయనమ్మ పెద్దది. వాళ్లకాలంలో కొన్ని కట్టుబాట్లు ఉండేవి. వాటిలో పెరిగింది ఆవిడ. కొందరిని తాకకూడదని ఆవిడకు చెప్పారు. ఆవిడ పాటించింది. నువ్వూ, సాంబయ్యా ఒకే బళ్లో ఒకే బెంచిమీద కూచుని చదువుకుంటున్నారు. మీరిద్దరూ స్నేహితులు, స్నేహంలో అలాంటివి లేవు. ఇతరులకు అవమానకరం కానంతవరకూ, ఇతరులను ఇబ్బంది పెట్టనంత వరకే ఆచారం. అవతలివాడిని అవమానించే ఆచారం ఎవరు చెప్పినా పాటించక్కరలేదు. అలా అని చెప్పినవాళ్లతో తగాదా పెట్టుకొనూ అక్కరలేదు. వాళ్లతరం అయిపోతోంది. మాతరం అయిపోతోంది. మీ తరం మొదలవుతోంది. ఇవేవీ పట్టించుకోకు" అని అమ్మ చెప్పింది చినబాబుకి.

ఆనాటి నుంచి సాంబయ్య, చినబాబు వేరు కారు. అలా అలా సాగుతూ వచ్చి వచ్చి ఈ నాటి కిలా ఒకరినొకరు ప్రశ్న- జవాబు అయి మిగిలారు.

"అయితే అంతేనంటావా?" అని చినబాబు ప్రశ్న. దానిలో కొంత ఒప్పుదల, కొంత తప్పుదల.

"అంతకాక మరింకెంత చిన బాబూ?" అని సాంబయ్య జవాబు. దానిలో అంత, కొంత ఏవీ లేవు. అంతా నిశ్చయమే.

"సాంబా! ఇన్నేళ్లు భూమిని నమ్ముకొని బతికాం. ఇప్పుడు అమ్మేసి ఊరొదిలి పోయి ఎలా బతుకుతాంరా?"

"చినబాబూ! ఇన్నాళ్లూ ఈ పని చేస్తున్నాం కనక దాని మీద మమకారం సహజం. అలవి కానప్పుడు, మరోదారి లేనప్పుడు ఏం చేస్తాం? ఇక బతకటమంటావా? ప్రాణం ఉన్నన్నాళ్లూ ఎలాగైనా బతుకుతాం. బతకటానికి ఇది కాకపోతే మరొకటి చేస్తాం. నువ్వంటే ఇంట్లో కూచుని వ్యవహారం నడిపావు కాబట్టి ఎలా బతుకుతాం అంటున్నావు. నేను నేల మీద నిలబడి బరిలోదిగి పనిచేశాను కాబట్టి బతగ్గలం అంటున్నాను. నేను నీకోసం పనిచేశానని, నువ్వు తినికూచుని రాచరికం చేస్తున్నావని అనుకోనీ! మన సంగతి మనకి తెలుసుకదా! అయినా ఈ రావణకాష్ఠం ఇప్పుడే


అంటుకుంది. ఇది అలా కాలేది కాని ఆరేదికాదు. ఆరనివ్వరు. అది ఆరిపోతే అంటించిన వాళ్లకి బతుకుతెరువు లేదు. అది వాళ్ల వ్యాపారం. పోనీ! అలాగే చేసుకోనీ! ఈ కాలం మనది కాదు. మనం తప్పుకోవటం మంచిది. కాదని మొండికేసి సాధించగలిగింది ఏమీ లేదు దుంపనాశనం అయిపోవటం తప్ప."

"అది కాదురా సాంబా! అసలు ఇదంతా ఎలా పుట్టిందో అర్థం కావటం లేదు. అదీ బాధ!"

"ఎలా పుట్టిందో పుట్టింది. ఎవరో పుట్టించకుండా ఏదీ పుట్టదుకదా! మీ తాతగారూ, పెదబాబుగారూ ఈ ఊరు కట్టారు. అరకలు పట్టి దున్నారు. అప్పుడు లేదు ఇది. పదిమందినీ ఇంటివాళ్ల నుకున్నారు. అప్పుడు లేదు ఇది. ఇప్పుడొచ్చింది. నీ పొలం పెరగకపోనీ, తరిగిపోనీ నా మడి చెక్క ఎదగక పోవటం తప్పయింది. బోర్లా పడ్డవాడివి అలాగే ఉండి పోకుండా చేతులానించి నిలబడదామని బారెన్లు వేయటం నీ తప్పయింది. పొగాకు ధర పలకటం తప్పయింది నీ పెట్టుబడి, అప్పులు, తనఖాలు లెక్కల్లో లేవు, నీ పొగాకు డబ్బే లెక్కకొచ్చింది.

"చినబాబూ! ఈ రోజుల్లో ఒక్కటే లెక్క కాయకష్టం చేసేవాడిదే శ్రమ. అదే లెక్కకొస్తుంది. మిల్లులో పనిచేసే వాడిదే శ్రమ. ఆ మిల్లు మిషన్లు తిప్పేవాడిదే శ్రమ. ఆ మిషన్లు తయారు చేసిన వాడిదే శ్రమ. కానీ చినబాబూ! ఆ మిషన్ని కనిపెట్టిన వాడిది శ్రమ కాదు. ఆ వెర్రిబాగులోడు రాత్రిపగలు కూచుని ఈ నట్టు ఇక్కడ, ఈ బోల్టు ఇక్కడ అంటూ మార్చి మార్చి కాగితాలు ఖరాబుచేసి చివరికి బొమ్మగీసి ఇస్తే అది శ్రమకాదు, బుర్రతో పని చేయటం శ్రమ కాదు చినబాబూ! కండ కరిగించటం ఒక్కటే లెక్కకొస్తున్న రోజులివి. కనక నువ్వు దోపిడీదారువి. నేను నీ దోపిడీలో నా రెండెకరాలు ఎదుగూ బొదుగూ లేకుండా చేసుకున్నాను మరి. నువ్వు పొగాకు బేరన్లు ఎత్తెయ్. మళ్లీ సంపాదన కోసం ప్రయత్నం చెయ్యకు. ఉన్న కాస్త అమ్మేసుకుపో. నీ జోలికిరారు. నువ్వు నీ పొలం మీద పెట్టుబడి పెట్టావో అయిపోయావన్నమాటే. కనక చినబాబూ! అబ్బాయెలాగూ పట్నంలోనే ఉన్నాడు. పద! తప్పుకుందాం!"

"చినబాబూ!" బయటినుంచి పిలుపుకి




ఉలిక్కిపడ్డాడు సాంబయ్య.

"చూశావా చినబాబూ! మూణ్నెల్లక్రితం దాకా ఎవరైనా అలా పిలిచారా నిన్ను? పిలుపులో 'గారు' ఎగిరిపోయి ఎన్నాళ్లయిందో గుర్తుందా నీకు? ఎవరు పిలుస్తున్నారో తెలుసా నీకు? మన పంచాయితీ గుమాస్తా. అలా ఎందుకు పిలుస్తున్నాడో తెలుసా? ప్రెసిడెంటు రమ్మన్నాడు. మొన్నటిదాకా ప్రెసిడెంటువి నువ్వు. వీళ్లందరూ నిన్ను ఖుషామత్ చేయడానికే ప్రయత్నించారు. బోలా మనిషివి కదా... ఊరుకోసం అంటూ ఎక్కడలేని పనులూ మొదలు పెట్టావు. మన మనుషులే కదా, మన కళ్లముందే పెరిగారు కదా అని కాంట్రాక్టులు ఇచ్చావు. కష్టంలో వున్నామంటే ఎక్కడికి పోతార్లే పనులు పూర్తిచేయకుండా అంటూ బిల్లులు ఇచ్చేశావు. ఇప్పుడేమైంది? పంచాయితీ సొమ్ము కన్నంపడింది. పనులన్నీ వదిలేసి తిరుగుతున్నారు దొరలు. చివరికి పంచాయితీ సొమ్ము వాడుకున్నవాడివి నువ్వు అని తేలింది. ఏం చేస్తావు? వెళ్లు వెళ్లి చెప్పు" అని రుంజుకున్నాడు సాంబయ్య.

"చినబాబూ!" బయటి నుంచి మళ్లీ పిలుపు.

విసురుగా లేచాడు సాంబయ్య. అదే విసురులో బయటికి వెళ్లాడు.

"ఏమిటి కథ?" అని అడిగాడు.

"ప్రెసెడెంటు గారు రమ్మన్నారు." గుమాస్తా జవాబు.

"సాయంత్రం వస్తార్లే వెళ్లు."

"ఇప్పుడు రమ్మన్నారు."

"రారు! అంతగా పనుంటే రమ్మను." విసురు తగ్గకుండానే తలుపు వేసి లోపలికి వెళ్లిపోయాడు సాంబయ్య.

* * *

రాత్రి దక్షిణపు గాలి జోరుగా ఉంది. మండువా లోగిలి నుంచి డాబా మీదకి మారింది చర్చ. యాభై ఏళ్ల చరిత్ర కుప్పలు కుప్పలుగా ఆ చీకటిలో పోగుపడుతోంది. పదకొండు కొట్టింది కిందహాల్లో గడియారం. అప్పుడు తూరుపు పొలంవైపు అల్లరి వినిపించింది. పల్లెటూరి రాత్రి నిశ్శబ్దంలో శబ్దం గాలితోటే ప్రయాణిస్తుందికదా! మాటల్లో మునిగి పోయిన వాళ్లు తల తిప్పి చూసేసరికి



## ముందు చూపు

"నెలసరి సామానులు కొనడానికి బజారు కెళుతున్నారా, వదినగారూ?"

"అవునండీ. ఈ రోజు రెండోతేదీ కదా!"

"అయితే ఈ లిస్టు కూడా తీసుకొండి. ఇది ఈ నెలలో మేం మిమ్మల్ని అప్పు అడగాలనుకున్న సామాన్ల లిస్టు. మీక్కావలసిన వాటితోటే ఈ సామానులు కూడా తెచ్చేసుకుంటే మాకు అప్పు ఇవ్వడానికి మీరు ఇబ్బంది పడనవసరం లేదు."

"ఆఁ ?!"

వి.వి. సీతారామ్‌దాస్ (గుంటూరు)

## ఊర్వశి శారద...

మొదట్లో ఎన్నో ఎదురు దెబ్బలు తిన్నది, తెనాలిలో 'సత్యవతి'గా జన్మించిన శారద, చిత్రాల్లో నటించాలని తన 13వ సంవత్సరంలోనే మద్రాసు చేరింది. డాక్టర్ రాజారావు తన చిత్రంలో వేషం ఇస్తానని శారదను మద్రాసు రప్పించారు. అయితే ఆ వేషం కాస్తా మరో నటి ఎగరేసుకుపోయింది. తర్వాత ఎల్.వి.ప్రసాద్ 'కొడుకులు - కోడళ్లు' చిత్రం నిర్మిస్తూ శారదను ఒక కోడలుగా తీసుకున్నారు. అయితే దరిమిలా ఆయన ఆ చిత్ర నిర్మాణం నుంచే విరమించుకున్నారు. రెండు అవకాశాలు వరుసగా చేజారిపోవటంతో శారద మనస్తాపానికి లోనైనా, ఓపికతో నిరీక్షించి నేడు మేటి అభినేత్రిగా మారింది.



సేకరణ : అట్లూరి శరత్‌బాబు

తూరుపు పొలంలో మంటలు.

"చినబాబూ! మన బేరన్లే" అంటూ ఒక్క పరుగున కిందికి దిగాడు సాంబయ్య. వెనకే చినబాబు. ఎంతదూరం? అయిదు నిముషాల పరుగు!

అగ్నిదేవుడికి ఎంత ప్రీతి పొగాకు అంటే! సురసుర అంటుకుపోయింది. పెద్ద వాసాలు పటపటమని పోతున్నాయి. బేరన్ మంటలు ఆర్పడానికి ఎవరున్నారు? వాళ్లిద్దరూ తప్ప! నిశ్చేష్టులై నిలబడిపోయా రిద్దరూ. ఎవరి పని? ఎవరు చేశా రీపని? చినబాబుకి అర్థంకాలేదు. సాంబయ్యకి అర్థమైంది. ప్రెసిడెంట్! చినబాబు పొలాన్ని కలిపేసుకుందామని. ఎలాగూ చినబాబుకి ఊళ్లో బతకటం ఇక సాధ్యం కాదని, చావుకి పెడితే లంఖణాలకి వస్తుందని... ప్రెసిడెంట్! సాంబయ్యకు ఆవేశం ఆగలేదు, ఆక్రోశానికి అదుపూ లేదు. పక్కపొలం ప్రెసిడెంట్‌దే. వాములు ఏనుగుల్లా వున్నాయ్. వాటిమీద సాంబయ్య చూపుపడటం చినబాబు చూపు తప్పించుకోలేదు.

"వద్దు!" అన్నాడు చినబాబు.

"ఊరుకో, నీకు తెలియదు" అన్నాడు సాంబయ్య.

చినబాబు ఆపేలోగానే కొరకంచు సాంబయ్య చేతిలో నుంచి విసురుగా వెళ్లి ప్రెసిడెంట్ వామి మీద వాలింది.

చినబాబు బేరన్లు తగలబడుతుంటే ఎక్కడున్నారో కానీ కొరకంచు గాలిలో ఎగురుతూ వస్తుండగానే ముప్పయ్ నలభై మంది బూతులు తిడుతూ సాంబయ్య మీదకి వచ్చారు ప్రెసిడెంట్ పొలంలో నుంచి. కర్రలు లేస్తున్నాయి. రంగం పొలం నుంచి పొగడ చెట్ల కిందికి మారిపోయింది. ఎంత కాయకష్టం చేసిన శరీరమైన యాభైఏళ్ల అలసట సాంబయ్యను ఆవరిస్తోంది. చినబాబు 'వద్దు, ఆపండి' అంటూనే వున్నాడు. ఒకడి చేతిలో కర్రకు బదులు గొడ్డలి తళుక్కుమంది. అది సాంబయ్య వీపువైపు తిరుగుతుంది. చినబాబుకి ఏం జరుగుతోందో అర్థం కావటం లేదు గొడ్డలికీ, సాంబయ్యకీ మధ్యకి వచ్చిపడ్డాడు. పొగడ పూల కుప్పమీద చినబాబు కూలిపోయాడు గుంపు మాయమై సాంబయ్య మిగిలాడు.

"సాంబా! అమ్మనడుగు, చెక్కపెట్టెలో కాగితాలున్నాయి, ఆరెకరాలూ, బేరన్లు నీపేరు మీదున్నాయి. అబ్బాయి కాయకష్టం మనిషి కాదు - బుర్రపనివాడు. వాడికీ పొలాలూ పుట్రలూ అక్కర్లేదుట. అమ్మ వూరొదలదు, ఊపిరి వున్నన్నాళ్లు తిండిపెట్టు చాలు!" చినబాబు కళ్లు వాలిపోయాయి.

సాంబయ్య నోటమాట లేదు. అతగాడి చూపులు చినబాబు ముఖం మీదే ఉన్నాయి. అది శూన్యదృక్కు. అతగాడి చేతులు చినబాబు నెత్తురులో తడిసిన పొగడపూలతో దండ కడుతున్నాయి అసంకల్పితంగా!

